


కిసాన్‌నగర్‌లో ఆర్యవైశ్యుల, లక్ష్మీగణపతి కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల, హాజరైన ప్రజలు

# గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తా

- ఆర్యవైశ్యుల లక్ష్మీగణపతి కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి గంగుల

కార్పొరేషన్, నవంబర్ 2: కరీంనగర్ నుంచి నాలుగోవ సారి తనను గెలిపిస్తే ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయడమే కాకుండా కరీంనగర్‌ను రాష్ట్రంలో రెండో నగరంగా తీర్చిదిద్దుతానని బీఆర్ఎస్ అభ్యర్థి, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం రాత్రి స్థానిక కిసాన్‌నగర్‌లో ఆర్యవైశ్యుల, లక్ష్మీగణపతి కాలనీవాసుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి హాజరైన మంత్రి మాట్లాడుతూ.. ఈ పదేండ్ల కాలంలో నగరాన్ని ఎంతో అభివృద్ధి చేశామన్నారు. తెలంగాణ రాక ముందుకు, ఇప్పుడు కరీంనగర్ ఎలా ఉందో ఒక్కసారి పరిశీలించాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి పనులను చేపడుతున్నదని వివరించారు. నగరాభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ. వేల కోట్ల నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. నగరంలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటుగా కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్ వంటి ప్రాజెక్టులను తీసుకువచ్చి నగర రూపురేఖలను మార్చామని తెలిపారు. మళ్లీ గెలిపిస్తే నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, నాయకులు చల్ల హరిశంకర్, ఎడ్ల అశోక్ పాల్గొన్నారు.

# స్వపరిపాలనలోనే గ్రామాల అభివృద్ధి

- రోడ్ల అభివృద్ధిని చూసి గెలిపించండి
- గంగుల కమలాకర్ సతీమణి రజిత
- దుర్శేడ్‌లో ఇంటింటా ప్రచారం
- బొట్టుపెట్టి కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థన



దుర్శేడ్‌లో ప్రచారం చేస్తున్నగంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత, తదితరులు

కరీంనగర్ రూరల్, నవంబర్ 2: స్వపరిపాలనలో గ్రామాలను ఎంతో అభివృద్ధి చేసుకున్నామని, నాటి పల్లెల కంటే నేటి పల్లెలు అభివృద్ధి బాటలో సాగుతున్నాయని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ సతీమణి గంగుల రజిత అన్నారు. మండలంలోని దుర్శేడ్ గ్రామంలోని అభివృద్ధిని చూసి గంగులను గెలిపించాలని కోరారు. గురువారం కరీంనగర్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో రాష్ట్ర మంత్రి గంగుల సతీమణి రజిత ఒక వైపు, గంగుల సుధాకర్ తన సతీమణితో కలిసి మరోవైపు ప్రచారం చేశారు. మహిళలతో కలిసి ఇంటింటికీ ప్రచారం చేశారు. ఆసరా పింఛన్లు అందుతున్నాయా..? రైతుబంధు వస్తుందా..? అంటూ వృద్ధులను, రైతులను ఆప్యాయంగా పలుకరించారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే ఆసరా పింఛన్‌ను ₹3 వేల నుంచి ₹5 వేల వరకు పెంచుతారని వారికి అవగాహన కల్పించారు. మహిళలకు, ఆడపడుచులకు కుంకుమపెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా గంగుల రజిత మాట్లాడారు. రాష్ట్రం వచ్చిన తరువాత గ్రామం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. సమైక్య పాలనలోని గ్రామ పరిస్థితిని, ప్రస్తుతం అభివృద్ధి చెందిన విశాలమైన రోడ్లు చూడాలని, గ్రామంలోని సీసీ రోడ్లతో వీధులు ఎంత అందంగా కనిపిస్తున్నాయని తెలిపారు. కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ.. గంగుల కమలాకర్‌ను మరోసారి గెలిపించాలని ప్రచారం చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, కల్యాణలక్ష్మి, రైతుబంధును ఇంటింటికీ అందిస్తున్నారని వివరించారు. గ్రామాల్లో గల్లీగల్లీకి సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేశారని గుర్తు చేశారు. గ్రామం మరింత అభివృద్ధి చెందాలంటే గంగుల కమలాకర్‌ను గెలిపించాలని, కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎం చేయాలని కోరారు. కేసీఆర్ లేని తెలంగాణ గుడ్డి దీపం అవుతుందన్నారు. మీ బిడ్డగా మూడుసార్లు గెలిపించారని, మరోసారి ఆశీర్వదించాలని, కారు గుర్తుకు ఓటు వేసి గంగుల కమలాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. మా ఓటు గంగుల కమలాకర్‌కే అంటూ గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున్న గంగుల రజితకు. గంగుల సుధాకర్‌కు మద్దతు తెలిపారు. ప్రచారంలో రజితకు తోడుగా పలువురు గ్రామస్తులు వచ్చారు. ప్రచారంలో సర్పంచ్ గాజుల వెంకటమ్మ, ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు, దాది సుధాకర్, మాజీ సర్పంచ్ తోట లక్ష్మి, సింగిల్ విండో డైరెక్టర్ తిరుపతి, గాజుల అంజయ్య, గంగుల సుధాకర్, కుటుంబసభ్యులు అంబిక, ఎంపీటీసీ గోల్లి రాజ్యలక్ష్మి, సంతోష, సుజాత, అనిత కుమారి, వేణు మాధవరావు, యూత్ మండలాధ్యక్షుడు నెరెళ్ల శ్రీనివాస్, అంజయ్య, రాజ్‌కమల్, గౌడ నర్సయ్య, కుమార్, భూతం రవీందర్, పురుషోత్తం, శ్రీరామోజ్ తిరుపతి, రమేశ్, బోగ తిరుపతి, మధు, మహేశ్, శ్రీనివాస్, సతీశ్, నారాయణ, పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

# ఢిల్లీ పార్టీలతో ఆగం కావద్దు

- గ్రామాల అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వండి
- జీకే యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగుల ప్రదీప్



తాహెర్ కొండాపూర్‌లో ప్రచారం చేస్తున్న గంగుల ప్రదీప్, తదితరులు

కరీంనగర్ రూరల్: నవంబర్ 2: ఢిల్లీ పార్టీలు వస్తే, తెలంగాణను ఆగం చేస్తాయని, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి మరోసారి అవకాశం ఇవ్వాలని జీకే యూత్ నియోజకవర్గ ఇన్‌చార్జి గంగుల ప్రదీప్ అన్నారు. కరీంనగర్ మండలంలోని తాహెర్ కొండాపూర్, బహాదూర్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామాల అభివృద్ధి, నియోజకవర్గంలో గంగుల చేసిన అభివృద్ధిని, తెలంగాణ వచ్చిన తరువాత, రాక ముందు పరిస్థితులను వివరించారు. గ్రామాల అభివృద్ధికి మరో సారి గంగుల కమలాకర్‌కు అవకాశం ఇచ్చి, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో బుర్ర తిరుపతి, ఆంజనేయులు, బలరాం, సురేందర్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



పెద్దిరెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

- మాజీ మంత్రి పెద్దిరెడ్డికి బోయినపల్లి సూచన
- ఎన్నికల ఇన్‌చార్జిగా నియామకమైన పెద్దిరెడ్డికి సత్కారం

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 2: ఇన్‌చార్జి బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి హుజూరాబాద్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో గులాబీ జెండా ఎగురవేయాలని, సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని మాజీ మంత్రి పెద్దిరెడ్డికి, వినోద్‌కుమార్ సూచించారు. హుజూరాబాద్, హుస్నాబాద్ శాసనసభ ఎన్నికల ఇన్‌చార్జిగా నియామకమైన మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఇనుగాల పెద్దిరెడ్డిని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం సాయంత్రం హుజూరాబాద్‌లో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పట్టణంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు నివాసానికి వచ్చిన వినోద్‌కుమార్‌ను పెద్దిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే తనకు ఆ పదవి రావడానికి కృషి చేసిన వినోద్‌కుమార్‌ను పెద్దిరెడ్డి సత్కరించారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు వర్ధినేని రవీందర్‌రావు, గందె శ్రీనివాస్, పొనగంటి మల్లయ్య, కిషన్‌రెడ్డి, చింత శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్లను సమర్పించాలి

- డీఈవో పమేలా సత్పతి



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 2: అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయబోయే అభ్యర్థులు వారి నామినేషన్లను స్వయంగా సంబంధిత రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో అందజేయాలని, జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. శుక్రవారం నుంచి అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ మొదలు కానున్నాయన్నారు. సువిధ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు సమర్పించినా, అది విజయవంతం అయిన అనంతరం వచ్చే పత్రాలపై అభ్యర్థి స్వయంగా సంతకం చేసి, ఆ కాపీలను ఆర్వో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. నామినేషన్ కోసం కళ్లద్దాలు, కండువా, టోపి, పార్టీలను చూపే ఇతర గుర్తులు ధరించకుండా అభ్యర్థి స్పష్టంగా కనిపించే 2X2.5 సైజు పాస్‌పోర్టు ఫొటోలు ఇరవై అందజేయాలని సూచించారు. ఎన్నికల ఖర్చులు ఏవైనా రూ.20వేల లోపు నగదు రూపంలో, అంతకు మించి జరిగే ఖర్చును చెక్కు రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ సమర్పించిన రోజే ఎన్నికల ఏజెంట్ వివరాలు తెలపాలని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్లు సమర్పించిన రిజిస్టరులో నమోదైన వరుస ప్రకారమే నామినేషన్ పత్రాలు పరిశీలించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు బహుమతులు, అక్రమంగా మద్యం సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు తెలిస్తే ఆప్రాంతం నుంచి సీ-విజిల్ మొబైల్ యాప్ ద్వారా లైవ్ లొకేషన్‌తో కూడిన ఫొటోతో ఫిర్యాదు అందజేయాలన్నారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ప్రకటించారు. సుమోటాగా స్వీకరించి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. నియోజకవర్గాల్లోని వాహనాల అనుమతుల కోసం పోలీస్ నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల కోసం కావాల్సిన మౌలిక వసతులు కల్పిస్తామని, దివ్యాంగులు, ఎనభై ఏండ్ల పైబడ్డ వృద్ధుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో చొప్పదండి, మానకొండూరు, కరీంనగర్, హుజూరాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల ఆర్‌వోలు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, కె.మహేశ్వర్, రాజు, డీఆర్‌వో పవన్‌కుమార్, ఏసీపీ లక్ష్మీనారాయణ, పార్టీల నాయకులు ఉన్నారు.

# నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి

- పటిష్టమైన భద్రతా చర్యలు, బారికేడ్ల ఏర్పాటు

కలెక్టరేట్, నవంబర్ 2: కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్లు కలెక్టరేట్ వెనక వైపు గల డివిజనల్ రెవెన్యూ అధికారి కార్యాలయంలో స్వీకరించేందుకు ఎన్నికల అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. నామినేషన్లు వేసేందుకు వెళ్లే అభ్యర్థులు, వారి ప్రతిపాదకులు పాత కలెక్టరేట్ రెండో గేటు నుంచి నేరుగా అసెంబ్లీ రిటర్నింగ్ కార్యాలయానికి వెళ్లేలా కొత్తగా దారి వేశారు. ఆర్‌వో కార్యాలయం లోనికి వెళ్లేందుకు, తిరిగి బయటకు వచ్చేందుకు వేర్వేరుగా బారికేడ్లు కట్టారు. అలాగే, దారిని చూపే బోర్డులను సైతం ఏర్పాటు చేశారు. రెండో గేటుకు ఎదురుగా నూతన కలెక్టరేట్ భవన నిర్మాణం జరుగుతుండగా, పాత, కొత్త కలెక్టరేట్ల మధ్య గల ఖాళీ స్థలాన్ని చదునుచేసి, ఆర్‌వో కార్యాలయానికి వెళ్లేందుకు దారి నిర్మించారు. కలెక్టరేట్ రెండో గేటు వరకు మాత్రమే నామినేషన్ వేసేందుకు వచ్చే అభ్యర్థుల వాహనాలను అనుమతించనున్నారు. అక్కడి నుంచి అభ్యర్థులు కాలి నడకన ఆర్‌వో కార్యాలయానికి వెళ్లాల్సి ఉన్న క్రమంలో దారిపై నీటిని చల్లి రోలింగ్ చేశారు. అ లాగే, గేటు నుంచి ఆర్‌వో కార్యాలయం వరకు అడుగడుగునా పోలీసులచే భద్రతా చర్యలు చేపట్టినట్లు రిటర్నింగ్ అధికారి కె.మహేశ్వర్ వెల్లడించారు.